స్వచ్ఛాంధ్ర సిగ్గుపడేలా..!

- అంతా ఉత్తుత్తి ఆర్భాటమే
- పట్టణంలో కనుమరుగవుతున్న పచ్చదనం
- సుందరీకరణకు తిలోదకాలు
- బోసిపోతున్న డివైడర్లు
- జగనన్న హరిత నగరం ప్రణాళిక అమలేదీ?


ఈదరపల్లి వంతెన నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ వరకు మెయిన్‌రోడ్డు మధ్యలో డివైడర్ దుస్థితి


అమలాపురం మెయిన్ రోడ్డులోని డివైడర్లలో నిస్తేజంగా కనిపిస్తున్న చెట్లు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో క్రమేపీ పచ్చదనం కనుమరుగవుతోంది. కూటమి ప్రజా ప్రతినిధులు పట్టణ సుందరీకరణ మాటే మరిచారు. ప్రధానంగా పట్టణంలో ఈదరపల్లి వంతెన నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ దాదాపు కిలోమీటరు మేర మెయిన్ రోడ్డు మధ్యలో డివైడర్లు విస్తరించి ఉన్నాయి. ఈ డివైడర్లు పచ్చదనంతో గతంలో ఆహ్లాదంగా కనిపించేవి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ డివైడర్లు పలు రకాల చెట్లు, మొక్కలతో నిత్యం పచ్చదనంతో కళకళలాడేవి. ఇప్పుడు అవే డివైడర్లు నిస్తేజంగా దర్శనమిస్తున్నాయి. వాడిపోయిన, ఎండిపోయిన మొక్కలతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. గతంలో మున్సిపల్ వాటర్ వర్క్స్ నుంచి ఓ ట్యాంకర్ వారానికోసారి డివైడర్లలో మొక్కలు, చెట్లకు నీరు పెట్టే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాకా మున్సిపాలిటీ పచ్చదనాన్ని పాలకులు పట్టించుకోవడం మానేశారు.

రూ.40 లక్షల మంజూరు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న హరిత నగరాలు పేరిట పట్టణాల సుందీకరణకు ఏర్పాట్లు జరిగాయి. ఈ పథకం కింద అమలాపురం మున్సిపాలిటీకి రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణ సుందరీకరణకు అప్పట్లో కమిషనర్ ఓ ప్రణాళిక సైతం తయారు చేశారు. పట్టణంలోని డివైడర్లే కాక పట్టణమంతా రోడ్ల చెంత మొక్కలు నాటేందుకు, గోడలకు పచ్చదనం నినాదాలతో రంగులు పూసేందుకు, అనవరమైన చోట్ల సిమ్మెంట్ బల్లలు వేసేందుకు.. ఇలా పచ్చదనం విస్తరణకు అప్పట్లో ఏర్పాట్లు జరిగాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా అప్పట్లో జరిగింది. కొందరు కాంట్రాక్టర్లు ఎక్కువ కోట్ చేయడంతో రీ టెండర్లకు ఏర్పాట్లు చేపడుతున్న తరుణంలో 2024 సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలు కావడం, కోడ్ అమలులోకి రావడంతో ఈ ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పట్లో మంజూరైన రూ.40 లక్షల నిధులను ఇప్పుడు పట్టణ సుందరీకరణకు సద్వినియోగం చేసుకునేందుకు కూటమి పాలకులు ప్రయత్నించడం లేదు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు పేరుతో రూ.65 కోట్లతో అంచనాలు తయారు చేశామని, ఏడు వంతెలు నిర్మిస్తామని ప్రజా ప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అడుగు ముందుకు పడడం లేదు.

ఎన్నాళ్లీ జాప్యం

మాస్టర్ ప్లాన్ అమలులోనే జాప్యం అనివార్యమవుతున్న క్రమంలో ఇక పట్టణ సుందీరకణ, పచ్చదనం అనేవి ప్రస్తుత పరిస్థితుల్లో పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పట్టణ సుందరీకరణ దేవుడెరుగు కనీసం మెయిన్ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లలోనైనా పచ్చని మొక్కలు, చెట్లను పెంచి సకాలంలో వాటికి నీరు అందిస్తే పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం సాకారమవుతుంది. లేకపోతే డివైడర్లు నిస్తేజంగా కనిపిస్తాయి.

పచ్చదనాన్ని పునరుద్ధరిస్తాం

పట్టణంలోని డివైడర్లలో లోపించిన పచ్చదనంపై చర్యలు చేపడతాం. త్వరలోనే డివైడర్లు పచ్చని మొక్కలు, చెట్లతో కళకళలాడేలా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తాం. గత ప్రభుత్వంలో జగనన్న హరిత నగరం కింద మున్సిపాలిటీకి రూ.40 లక్షలు మంజూరైన విషయంపై అవగాహన లేదు.

కేవీఆర్ఆర్ రాజు,
మున్సిపల్ కమిషనర్, అమలాపురం.

హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై బైక్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, వాహన చోదకులు

అమలాపురం టౌన్: హెల్మెట్ ధారణతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ అమలాపురం పురవీధుల్లో ఆదివారం సాగిన బైక్ ర్యాలీ ద్విచక్ర వాహన చోదకులను ఆలోచింపజేసింది. స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఈ బైక్ ర్యాలీని పట్టణ సీఐ పి.వీరబాబు ప్రారంభించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాయిరాజ్ సాత్విక్ తండ్రి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథం తదితరుల ఆధ్వర్యంలో ఈ అవగాహన బైక్ ర్యాలీ జరిగింది. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవడం మరచిపోవద్దని ఈ బైక్ ర్యాలీ సందేశాన్ని ఇచ్చింది. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, అధిక వేగం అసలే వద్దని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ర్యాలీలో పాల్గొన్న ద్విచక్ర వాహన చోదకులు నినాదాలు చేశారు. ర్యాలీలో సీఐ వీరబాబుతో పాటు పట్టణ ఎస్సై తిరుమలరావు, ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు పాల్గొని అవగాహన కల్పించారు. గడియారం స్తంభం సెంటరు నుంచి ప్రారంభమై ముమ్మిడివరం గేటు సెంటరు, ఎర్ర వంతెన, ఎన్టీఆర్ మార్ట్, నల్లవంతెన, హైస్కూలు రోడ్డు, బ్యాంక్ స్ట్రీట్ మీదుగా దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది.

ముఖద్వారం శిథిలం.. ప్రమాదానికి ఆస్కారం


పెచ్చులూడిన కమలా నెహ్రూ బాలికోన్నత పాఠశాల ముఖద్వారం స్లాబు

యానాం: ఎన్నో ఏళ్ల చరిత్ర గల స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల భవనం ముఖద్వారం శిథిల స్థితికి చేరుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. సుమారు 70 ఏళ్ల క్రితం స్థానిక బుస్సీవీధిలో కమలా నెహ్రూ బాలికోన్నత పాఠశాలను నిర్మించారు. వందలాది మంది బాలికలు ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే హైస్కూల్ ముఖద్వారం స్లాబు పెచ్చులూడడంతో దానిలో ఊచలు సైతం బయటకు కనిపిస్తున్నాయి. వర్షాల సమయంలో మరింత ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం విద్యాశాఖాధికారి స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన శ్లాబును తొలగించి నూతనంగా శ్లాబు నిర్మాణం చేయాలని సోషల్ యాక్టివిస్టు పెద్దిరెడ్డి బాబి, పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యాయస్థానం తీర్పు దళిత వ్యతిరేక వర్గాలకు కనువిప్పు


తోటపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్

తాళ్లరేవు: కులవివక్షకు గురైన పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సాధనాల మంగాదేవికి కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం తోటపట గ్రామంలో పలు సంఘాల నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పెట్టా వరప్రసాద్ మాట్లాడుతూ మంగాదేవి తనకు జరిగిన అన్యాయం పట్ల వీరోచితంగా పోరాడి గెలిచిందన్నారు. అంగన్‌వాడీ హెల్పర్‌గా 16 ఏళ్ల పాటు పనిచేసి పదోన్నతిపై పోలేకుర్రు–2 అంగన్‌వాడీ కేంద్రానికి కార్యకర్తగా వెళ్లగా అక్కడ దళిత వ్యతిరేక సామాజిక వర్గాల వారు అడ్డుచెప్పి కేంద్రానికి తాళాలు వేయడంతో కులవివక్షకు గురైందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి తాళాలు తీసినప్పటికీ గ్రామస్తులు పిల్లల్ని పంపకపోవడం, పలు ఇబ్బందులకు గురిచేసిన నేపథ్యంలో మంగాదేవి తీవ్ర మానసిక క్షోభకు గురైందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 28, 2018లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏడేళ్ల తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన మంగాదేవికి అనుకూలంగా రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తీర్పు ఇచ్చారు. ఐపీసీ సెక్షన్ కింద నమోదైన కేసుకు సంబంధించి ముద్దాయిలకు ఒక నెల జైలు శిక్ష, రూ.500 జరిమానా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ముద్దాయిలు నలుగురిలో ఒకరు మృతి చెందగా మిగిలిన ముగ్గురికి ఈ తీర్పును అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక దళిత మహిళకు జరిగిన అన్యాయంపై కోర్టు ఇచ్చిన తీర్పు దళిత వ్యతిరేక వర్గాలకు కనువిప్పు కావాలన్నారు. ఆత్మగౌరవం కోసం నిలబడి పోరాటం చేసిన మంగాదేవిని పలు దళిత సంఘాలు, కులవివక్ష పోరాట సమితి నాయకులు అభినందించారు. సమావేశంలో న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ, విప్పర్తి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు మేమూ రెడీ!

- యాత్రకు వెళ్లేందుకు భక్తుల ఆసక్తి
- మరికొన్ని బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సన్నద్ధం



అమలాపురం రూరల్: ఆర్టీసీ బస్సుల్లో మహా కుంభమేళాకు వెళ్లేందుకు భక్తుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల12వ తేదీన 6 ఆర్టీసీ బస్సుల్లో భక్తులు మహా కుంభమేళాకు వెళ్లారు. ఆ తర్వాత కుంభమేళాకు వెళ్లేందుకు కొంతమంది భక్తులు ముందుకు వచ్చారు. దాంతో ఆర్టీసీ అధికారులు భక్తుల కోరిక మేరకు ఈనెల 18వ తేదీన మరికొన్ని బస్సులను కుంభమేళాకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులతో బస్సులు ఫుల్ అయ్యాయి. అయినప్పటికీ కుంభమేళాకు వెళతామంటూ కొందరు భక్తులు ముందుకు వచ్చారు. దాంతో ఆర్టీసీ డీఎం సత్యనారాయణమూర్తి వెంటనే స్పందించి ఈనెల 21వ తేదీన మరికొన్ని బస్సులను కుంభమేళాకు పంపేందుకు సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయవచ్చునన్న నమ్మకంతో భక్తులు ఆసక్తి చూపుతున్నారు. కుంభమేళాకు వెళుతున్న ఆర్టీసీ బస్సులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం సత్యనారాయణమూర్తి కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు అతీతం

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్


మేనిఫెస్టో, బ్యాలెట్ పేపర్ల బ్రోచర్లు విడుదల చేస్తున్న హర్షకుమార్

ముమ్మిడివరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేస్తోందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ తరపున క్యాంపెయిన్‌లో భాగంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు అతీతమన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా విద్యావంతులు, మేధావులు పోటీలో పాల్గొంటారన్నారు. అయితే ఇప్పటికే అధికార పార్టీకి చెందిన కొంతమంది కొన్ని వెబ్‌సైట్లు పెట్టుకొని ఓటర్లుగా ఉన్న పట్టభద్రులను ప్రలోభాలకు గురి చేస్తురన్నారు. ఎన్నికల కమిషన్ కళ్లు మూసుకుని పని చేస్తోందని తాము ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ విడుదల చేసిన మేనిఫెస్టో, బ్యాలెట్ పేపర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి లక్ష్మణస్వామి, నెల్లి బాలకృష్ణ, బడుగు జేమ్స్‌పాల్, కాశి రామకృష్ణ, మోకా రామరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై అనుచిత చర్య

వ్యక్తిపై కేసు నమోదు

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని కాశిపేట సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. కె.గంగవరం మండలానికి చెందిన గంగాధర్ డి.రావులపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో అంబేడ్కర్ విగ్రహంపై మూత్ర విసర్జన చేశాడు. స్థానికంగా ఉన్న కొంత మంది యువకులు గమనించి అల్లవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాదు, టౌన్ సీఐ వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసుల సమక్షంలో మూత్రం విసర్జించిన వ్యక్తి అంబేడ్కర్ విగ్రహంపై పాలాభిషేకం చేసిన పిదప ఆందోళన సద్దుమణిగింది. అనంతరం ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్ నిర్వహించామన్నారు.

ప్రారంభమైన సీబీఎస్ఈ సిలబస్ ఆధారిత పరీక్షలు

ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షలకు స్వస్తి

యానాం: పుదుచ్చేరి ప్రాంతానికి ప్రత్యేక సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు(ఎస్ఎస్‌సీ) లేక పోవడంతో సరిహద్దు రాష్ట్రాల ఎస్ఎస్‌సీ బోర్డుల ద్వారా తమ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించుకుంటున్నారు. ఆవిధంగా యానాంలో ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు ద్వారా పరీక్షలు జరిగేవి. అయితే 2024–25 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో యానాంలో ఎస్ఎస్‌సీ బోర్డుకు స్వస్తి పలికారు.

పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం రీజియన్‌ల పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్స్, జూనియర్ కళాశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ఈ విద్యా సంత్సరం నుంచి అమలు చేస్తున్న నేపథ్యంలో యానాంలో సైతం శనివారం నుంచి పరీక్షలు జరుగుతున్నాయి. పుదుచ్చేరి వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 10, ప్లస్2 పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పుదుచ్చేరి పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. పుదుచ్చేరిలో 21 పరీక్షా కేంద్రాలు, మాహేలో 3, కారైకల్‌లో 10, యానాం, మాహేల్లో 2 కేంద్రాల చొప్పున ఏర్పాటు చేశారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 44 పాఠశాలల్లో చదువుతున్న 4,129 మంది విద్యార్థులు ప్లస్–2 పరీక్షలకు హాజరవుతుండగా మరో 86 పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. కారైకల్‌లోని 11 హైస్కూల్స్ నుంచి 1,203 మంది ప్లస్–2 పరీక్షకు హాజరవుతుండగా, మరో 25 హైస్కూల్స్ నుంచి 1,881 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. యానాం రీజియన్ నుంచి ఒక ప్రభుత్వ హైస్కూల్ నుంచి 46 మంది ప్లస్–2 పరీక్షకు హాజరవుతుండగా, మరో 8 ప్రభుత్వ హైస్కూల్స్ నుంచి 285 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు.

ఇప్పటి వరకు ఏపీ సిలబస్‌కు అలవాటు పడిన యానాం ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ కరికులమ్ బోధనపై విద్యాశాఖ శిక్షణ ఇచ్చింది. విద్యార్థులు ఎంతవరకు పాఠ్యాంశాలను అవగాహన చేసుకున్నారో వచ్చే ఫలితాలను బట్టి ఉంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అయితే సీబీఎస్ఈ విధానంలో విద్యార్థి ఒక్కో సబ్జెక్టులో కనీసం 33 శాతం మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధిస్తారు. ఇందులో స్కూల్ ఉపాధ్యాయుడు ఇంటర్నల్‌గా వేసేవి 20 మార్కులతో పాటు పరీక్షలో మరో 13 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధిస్తాడు. గ్రేడింగ్ విధానం ద్వారా మార్కులు వేస్తారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పి లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు.

ఎంపీ వైథిలింగానికి స్థానిక సమస్యల నివేదిక అందజేత


నివేదికను ఎంపీ వైథిలింగానికి అందజేస్తున్న విష్ణువర్ధనరావు

యానాం: యానాంలో నెలకొన్న సమస్యలతో పాటు పారిశ్రామికంగా నెలకొన్న అనుకూల, ప్రతికూలాంశాలు, మూతపడ్డ చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలపై సమగ్రంగా అధ్యయనం చేసిన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ అందించిన నివేదిక ఆదివారం ఎంపీ వైథిలింగానికి అందింది. యానాం సిటిజన్ ఫోరం తరపున ప్రముఖ పారిశ్రామికవేత్త ఈలప్రోలు విష్ణువర్ధనరావు ఆధ్వర్యంలో తయారు చేసిన నివేదికను ఆయనకు అందజేశారు. పారిశ్రామికంగా ఎన్నో ఏళ్లు వెలుగు వెలిగిన పలు పరిశ్రమల మూసివేతతో స్థానిక కార్మికులు, నిరుద్యోగ యువత, పరిశ్రమల పునః ప్రారంభానికి ప్రభుత్వం నుంచి చేయూత లేకపోవడం, రాయితీలు తదితర విషయాలను నివేదికలో పొందుపరిచారు. యానాంకు చెందిన ప్రముఖ రచయిత దాట్ల దేవదానం రాజు వృద్ధాప్యంపై రచించిన 'నాలుగో పాదం' కవితా సంపుటిని తమిళంలో అనువాదం చేసిన పుస్తకాన్ని ఎంపీ వైథిలింగం మాజీ సీఎం నారాయణసామికి అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు, అన్యం రామకృష్ణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబజార్‌లో కనీస వసతులు కల్పించండి

జేసీ నిషాంతికి ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు వినతి

అమలాపురం టౌన్: పునఃప్రారంభించిన అమలాపురం రైతు బజార్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) టి.నిషాంతికి ఆదివారం ఓ లేఖ రాశారు. జేసీతో పాటు రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌కు సైతం ఇదే డిమాండ్‌తో మరో లేఖ పంపించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ అమలాపురంలో ఓ ప్రకటన విడుదల చేశారు. రైతుబజార్ ఉనికిని తెలిపే బోర్డు రాత్రి సమయాల్లో స్పష్టంగా కనిపించేలా విద్యుత్ బోర్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఐవీ లేఖలో సూచించారు. అలాగే రైతు బజార్ ప్రవేశ ద్వారం నుంచి దుకాణాల వరకూ మధ్యలో ఉన్న రోడ్డులో విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించాలని కోరారు. రైతు బజారులో నిత్యం వచ్చే కూరగాయల వ్యర్థాలు, ఇతర చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కాపులపాలెంలో నేడు వీరభద్రుని సంబరం

తాళ్లరేవు: మండల పరిధిలోని కాపులపాలెం గ్రామంలో నేతికుండలో వెలసిన నేతిలో వీరన్నబాబు సంబరాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీరభద్ర దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటలకు పవిత్ర గోదావరి నదిలో స్నానం, 10 గంటల నుంచి వీరన్నబాబు గద్దె వద్ద స్వామివారి దర్శనం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతాయన్నారు. రాత్రి 8 గంటల నుంచి వీరముష్టుల ఆధ్వర్యంలో వీరనాట్యం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు


పూజలందుకున్న లక్ష్మీ గణపతి

అమలాపురం టౌన్: సంకట హర చతుర్థి సందర్భంగా స్థానిక కొంకాపల్లిలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా స్వామికి గరికతో అభిషేకించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఉదయం నుంచి రాత్రి వరకూ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. కొంకాపల్లి పెద్దలు, ఎంపీటీసీ సభ్యుడు పనసా బుజ్జి, కురసాల వీరబాబు, దూలం బుజ్జి తదితరులు లక్ష్మీ గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రసాద వితరణలో పాల్గొన్నారు.

ఘనంగా మసీదు ప్రారంభోత్సవం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మసీదును ఆదివారం మత పెద్దలు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి స్థానిక సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముతవల్లి షేక్ జిలాని, మహ్మద్ మక్బూల్, నాగూర్, రబ్బానీ, ఎండీ వై షరీఫ్, రఫీ, జియావుద్దీన్ పాల్గొన్నారు.

రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఊటుకూరి


సుబ్రహ్మణ్యేశ్వర స్వామితో కార్యవర్గ సభ్యులు

అమలాపురం రూరల్: రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అమలాపురం రూరల్ బండారులంకకు చెందిన మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఎన్నికయ్యారు. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం తృతీయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం విజయవాడలో ఆదివారం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శిగా మాడిశెట్టి శివ శంకరయ్య, కోశాధికారిగా కొండపల్లి పరమేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర దేవాంగ నాయకులు బొమ్మన దుర్గా ప్రసాద్, నక్కిన చిన వెంకటరాయుడు, చింతా శంకరమూర్తి, బండారు ఆనంద ప్రసాద్, మాడా మాధవి, పృథ్వీ అరుణ, బండ్ల తిరుమలాదేవి, చింతా శ్యామ్, రాము, కాలెపు శివ తదితరులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అభినందించారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ఇబ్బందులు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్

ముమ్మిడివరం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల కారణంగా ప్రైవేటు పాఠశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం యాపిల్ స్కూల్లో ఆదివారం గోదశి వుండరీష్ అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రైవేటు కాన్వెంట్ల కరస్పాండెంట్‌ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాచార హక్కు చట్టంలో లేని అంశాలను అధికారులు ప్రైవేటు పాఠశాలలపై రుద్దటం దారుణమన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పేరాబత్తుల రాజశేఖర్ కోరారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని ఆదివారం, సంకటహర చతుర్థి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహా నివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి, ఆలయ తలుపులు వేశారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో రెండు జంటలు పాల్గొన్నాయి. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 139 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 72 జంటలు, స్వామివారి గరిక పూజలో ఐదు జంటలు పాల్గొన్నాయి. 12 మంది భక్తులు స్వామికి ఉండ్రాళ్ల పూజలు జరిపారు. స్వామివారి సన్నిధిలో 30 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు, 16 మంది చిన్నారులకు అన్నప్రాసనలు, తొమ్మిది మందికి తులాభారం, ఒకరికి నామకరణం చేశారు. స్వామికి ఇద్దరు తలనీలాలు సమర్పించారు. అలాగే 39 నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. మొత్తం 3,127 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.4,22,563 ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నిత్య కల్యాణం.. పచ్చతోరణం


వాడపల్లి క్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తోంది. అశేష భక్తజనం తరలి రావడంతో ఇది కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందింది. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా, మిగిలిన రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వాడపల్లి క్షేత్రానికి భక్తులు తరలివచ్చి, అష్టోత్తర పూజలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వరస్వామిని దేవదాయ, ధర్మాదాయ శాఖ జాయింట్ కమిషనర్, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, పూజాదికాల అనంతరం వేదాశీర్వచనం, అనంతరం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ప్రతి శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కాకినాడ, అమలాపురం నాట్యాలయ బృందం వారు నిర్వహించిన ఉమా సోమేశ్వర కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది.

రేపు సాగునీరు విడుదల

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరా విధానం అమలులో భాగంగా మండలంలోని వాడపాలెం లాకుపై ఉన్న చానళ్లకు మంగళవారం సాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా మండలంలోని వాడపాలెం లాకులపైన గత వాడపాలెం ఓల్డ్, న్యూ చానల్స్‌కు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకూ 24 గంటల పాటు సాగునీరు సరఫరా చేయనున్నట్టు ఏఈ తెలిపారు. ఆయా చానళ్ల కింద కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టుకు సంబంధించిన రైతులు వంతుల వారీ విధానంలో తమ భూములకు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.